# ఉండు నాయనా దిష్టితీస్తా..

-జిల్లేళ్ళ బాలాజీ

"బామ్మా.. బామ్మా..ఎక్కడే" అంటూ హడావిడిగా ఇంట్లోకి అడుగుపెట్టాడు ఏకాంబరం.

"ఇదో..వచ్చే వచ్చే..." అంటూ పెరట్లో తులసికోటకు పూజచేస్తున్న పాపాయమ్మ మనవడి గావుకేకలు విని హారతి పళ్లెంతో సహా హాల్లోకి వచ్చింది.

"ఏమిట్రా..గావుకేకలు... ఏమిటీ విషయం?" అంది మనవడి కళ్లల్లోకి కళ్ళు పెట్టి చూస్తూ.

"ఇప్పడే ఫోన్‌కాల్ వచ్చిందే. అమ్మాయి తరఫువాళ్ళు బస్టాండ్‌కు వచ్చేశారట. నన్ను చూడ్డానికి ఇంకాసేపట్లో వస్తారుట..."సంబరపడి పోతూ అన్నాడు ఏకాంబరం.

"మా నాయనే...మా నాయనే! ఎన్నాళ్లకు నా మనవడికి కల్యాణయోగం వచ్చింది" ఆనందపడిపోతూ అంది బామ్మ.

"పోవే.. నాకు సిగ్గేస్తోంది" మెలికలు తిరిగిపోతూ అన్నాడు మనవడు.

"అబ్బో...అబ్బో...ఏకాంబరానికి ఎంత సిగ్గో? అదేదో సామెత చెప్పినట్టు పెళ్లిచూపులే ఇంకా పూర్తికాలేదు అప్పుడే మీ మనవడి ముఖంలో పెళ్లి కళ తాండవిస్తోందే..."

అంటూ ఇంట్లోకి అడుగుపెట్టాడు పక్కింటి సాంబశివరావ్.

"ఇదిగో సాంబయ్యా! నా మనవడికి దిష్టిపెట్టకయ్యా. నీవసలే మంచికళ్ళు కూడా కావు" అంటూ మనవడి వైపునకు తిరిగి "పాడుకళ్ళు పడనే పడ్డాయి ఉండునాయనా దిష్టి తీస్తా" అంటూ బొడ్డుదగ్గర దోపుకున్న తిత్తి తీసి అందులో నుండి గడ్డ కర్పూరం, అగ్గిపెట్టే తీసి హారతి పళ్లెంలో కర్పూరం వెలిగించి మనవడి ముఖం చుట్టూ తిప్పుతూ కుడిచేత్తో కర్పూరవు పొగను మనవడి ముఖానికి పూసింది.

కర్పూరం ఆరాక చూస్తే ఏకాంబరం ముఖం నల్లగా మసిబారిపోతూ కనిపించింది.

అది చూసి సాంబశివరావ్ పకపకమని నవ్వుతూ-

"నాకళ్లకేం కానీ అదేదో సామెత చెప్పినట్టు మీ మనవడి ముక్కూ, మొహమూ వచ్చేవాళ్లకు నచ్చితే అదే పదివేలు" అన్నాడు దెప్పిపొడుస్తూ.

"నా మనవడికేం. నవ మన్మథుడు. వాణ్ణి చేసుకోవడానికి ఏ పిల్లైనా పెట్టి పుట్టాలి.." అంటూ తన రెండుచేతుల్తో మనవడి ముఖాన్ని తాకి తన కణతలకు నొక్కుకుంది బామ్మ.

"బామ్మ మాటలకేం గానీ బాబాయ్ ఇవ్వాళ నువ్వూ, పిన్నీ ఇక్కడే ఉండి ఈ పెళ్లిచూపుల తతంగాన్ని ముందుండి విజయవంతంగా నడిపించాలి. వచ్చేవాళ్లకు ఏ కొరతా లేకుండా చూసి పంపే బాధ్యత మీదే" సాంబశివరావు పై బరువు బాధ్యతలు మోపుతూ అన్నాడు ఏకాంబరం.

ఉన్నపళంగా అతడు తనకు పెద్దరికం అంటగట్టేసరికి తెగ ఉత్సాహపడిపోయాడు సాంబశివరావు.

"ఔను పెద్దమ్మా...మగపిల్లాడి తరఫున ముందు మనంకదా వెళ్లి అమ్మాయిని చూసిరావాలి. మరిదేంటీ అదేదో సామెత చెప్పినట్లు అంతా రివర్సవుతోందేమిటీ?" అర్థంగాక పాపాయమ్మను అడిగాడు.

"మరేం లేదు సాంబయ్యా...పెళ్లిచూపులంటూ అబ్బాయి తరఫువాళ్ళు అమ్మాయిని చూడ్డం, స్వీట్లూ అవీ బాగా మెక్కడం, వెళ్ళి ఉత్తరం రాస్తామంటూ చెక్కా పోవడం...ఇదీ వరస. ఈ తతంగమంతా చూసి చూసి విసిగిపోయి 'ఈమారు ముందు మనమే వెళదాం. ఆనక వాళ్ళు వచ్చి చూడనీ' అని ఈ అమ్మాయి హుకూం జారీ చేసిందట. దాని ఫలితమే ఈ రివర్స్‌గేర్. అయినా నీ పిచ్చిగానీ సాంబయ్యా ఎవరు ముందు వెళ్లినా చూసుకోబోయేది వాళ్ళిద్దరేగా!" నవ్వుతూ అంది పాపాయమ్మ.

"మా బాగా చెప్పావ్ పెద్దమ్మా. అదేదో సామెత చెప్పినట్టు ఎవరు ముందు వెళితేనేం మంచి జరిగితే అంతే చాలు" మనస్ఫూర్తిగా అన్నాడతడు.

"అదేనయ్యా నేనూ కోరుకునేది. ఎలాగైనా నా మనవడు ఒకింటివాడైతే నాకంతేచాలు. ఆ...చూడు సాంబయ్యా...అమ్మాయి వాళ్ళు బస్టాండ్‌లో ఉన్నారట. కాస్త నువ్వు పెద్దమనిషిగా వెళ్లి వాళ్లను వెంటబెట్టుకురా" అంటూ అతడికి పని పురమాయించింది పాపాయమ్మ.

"ఇదిగో ఇప్పుడే బయలుదేరి చిటికెలో వెంటబెట్టుకురానూ...." అంటూ ఉత్సాహంగా కదలబోయాడు.

"అదిగో అదిగో...ఆ తొందరే వద్దన్నది. కాస్త నిమ్మళంగానే వెళ్లి వాళ్లను వెంటబెట్టుకురా. నీ పెళ్లాం ఉంటే ఇలా పంపించి నువ్వటు వెళ్ళు. అది నాకు పనుల్లో కాస్త సాయంగా ఉంటుంది" అంటూ వంటింట్లోకి దారితీసింది బామ్మ.

"అలాగే పెద్దమ్మా..." అంటూ బయటికి నడిచాడు సాంబశివరావ్.

గదిని సర్దే పనిలో పడ్డాడు ఏకాంబరం.

* * *

ఆ ఊరి బస్టాండ్‌లో అమ్మాయి కుటుంబసభ్యులు దిగి అప్పుడే పావుగంటయింది.

జిప్ సర్రుమంటూ లాగి బ్యాగ్‌లోంచి ఓ కర్రను బయటికి తీశాడు ఇంటర్ చదువుతున్న మదన్. అతడు అమ్మాయికి తమ్ముడు మాత్రమే కాదు, ఆలిండియా ట్వింకిల్ స్టార్ మాయాకాంత్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కూడా.

"దీని అవసరం ఇప్పుడేమొచ్చిందిరా?" కొడుకును మందలించాడు గుర్నాథం.

"నీకు తెలియదు డాడీ...మనమెవరమో వచ్చేవాళ్లకు తెలిసేదెలా? అందుకే దీన్ని ఇంటివద్దే తయారుచేసి పట్టుకొచ్చాను" అంటూ తను రాసి

పట్టుకొచ్చిన ఫ్లకార్డ్‌ను పైకెత్తి పట్టుకున్నాడు.

"ఒరేయ్...ఈ చిన్న బస్టాండ్‌లో దీని అవసరం లేదేమోరా?'' కొడుకును వారించింది జగదాంబ.

"నువ్వుండమ్మా...నీకేం తెలియదు'' అన్నాడు పెద్ద ఆరిందాలా ఫోజుపెట్టి.

చుట్టూ ఉన్న పరిసరాలను ఆసక్తిగా చూస్తూ నిలబడింది శ్రావణి.


చిన్నాచితకా పిల్లలు ఓ పదిమందిదాకా వాళ్ల ముందు మూగి వాళ్ల వింత చేష్టలు ఆసక్తికరంగా చూడసాగారు.

"మేము మేకుల ఏకాంబరాన్ని పెళ్లిచూపులు చూడ్డానికి వచ్చినవాళ్లం...'' అయిదవతరగతి చదువుతున్న ఓ కుర్రాడు ఆ ఫ్లకార్డ్‌లో రాసిన అక్షరాలను కూడి కూడి చదివాడు.

వాడు చదవడం పూర్తిచేసిన వెంటనే అక్కడున్న పిల్లలందరూ గట్టిగా చప్పట్లు చరిచారు.

ఫ్లకార్డ్‌లోని అక్షరాల చివరన తన అభిమాన నటుడు మాయాకాంత్ ఫోటోను కూడా అంటించాడు మదన్.

ఆ గుంపులో ముందునిలబడ్డ ఇద్దరు కుర్రాళ్ళు చేతులు వెనక్కు పెట్టుకుని ఆ నటుడి ఫోటోను చిరాగ్గా చూడసాగారు. రెండునిముషాలయ్యాక ఇద్దరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకుని సైగ చేసుకున్నారు.



అందులో ఒకడు 'రెడీ..వన్..టూ...త్రీ' అనడం తమ చేతిలోని పేడము ద్దను మాయాకాంత్ ఫోటోపై విసరడం క్షణాల్లో జరిగిపోయాయి.

తన అభిమాన నటుడిపై పేడముద్ద పడేసరికి తట్టుకోలేకపోయాడు మదన్.

"రేయ్..." అంటూ వాళ్లను పట్టుకోవడానికి ముందుకు ఉరికాడు పళ్ళు కొరుకుతూ.

"రేయ్ పరిగెత్తండ్రా..." అంటూ పరుగందుకున్నారు వాళ్ళు.

వెంటబడ్డాడు మదన్.

కానీ వాళ్ళెవరూ అతడి చేతికి చిక్కలేదు. దాంతో ఆయాసంతో వగ రుస్తూ మళ్లీ తన వాళ్లను చేరుకున్నాడు.


సరిగ్గా అప్పుడు బస్టాండ్‌లోకి అడుగుపెట్టాడు సాంబశివరావు.

"ఏమండీ... మీరు చిత్తూరు నుండి వస్తున్నారు కదూ" వాళ్లను అడిగాడు సాంబశివరావు.



## జర్నీ అంటే ఇష్టం

గాజియాబాద్‌లో పుట్టి న్యూ మిలీనియంలో అందాలకిరీటాన్ని చేజి క్కుంచుకున్న లారాదత్తా కెరీర్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంది. మోడలిం గ్‌లో రాణించి ఆ తర్వాత బాలీవుడ్‌లో వివిధ చిత్రాల్లోనూ, టాలీవుడ్‌లో మోహన్‌బాబు చిత్రాల్లో కూడా నటించింది. గ్లాడ్‌రాగ్స్ మేగజైన్ కాంపిటీష న్‌లో బహుమతి పొందిన లారా వివిధ దేశాల్లో పర్యటించింది. జర్నీ అంటే తనకెంతో ఇష్టం అంటోందీమె.




"ఎస్...చిత్తూరు నుండే వస్తున్నాం..." అంటూ అతడికి అక్షరాలు కనబ డేలా ప్లకార్డ్‌ను నిటారుగా పట్టుకున్నాడు మదన్.

"గుర్నాథం గారంటే మీరేనా?"

"ఔను...నేనే!" మీసాన్ని సవరిస్తూ అన్నాడు గుర్నాథం.

"ఈ ఊళ్ళో పెళ్లిచూపులకొచ్చారు కదూ!?"

"అవును..." పైట సర్దుకుంటూ అంది జగదాంబ.

"మేకుల ఏకాంబరం ఇంటికే కదూ!"

"ఎస్..." అంటూ శ్రావణి తమ్ముడికేసి తిరిగి "ఇక దీంతో పనేముందిరా నీకు. తీసి అవతల పడేయ్..." అంటూ కోపంగా వాడి చేతిలోని ప్లకార్డ్‌ను లాక్కొని దూరంగా విసిరికొట్టింది.

"హమ్మయ్య! అదేదో సామెత చెప్పినట్టు మిమ్మల్ని సులభంగానే గుర్తుప ట్టేశానన్నమాట. రండమ్మా వెళదాం" అంటూ ముందుకు దారితీశాడు సాంబ శివరావు.

అతడేదో సామెత చెబుతాడని ఆసక్తిగా ఎదురుచూసిన జగదాంబకు నిరు త్సాహం కలిగింది.

వాళ్లను పదినిముషాల్లో ఇంటికి తీసుకొచ్చాడు సాంబశివరావు.

"మీరిలా ఈ గదిలో రిలాక్స్ కండి సార్...నేవెళ్లి కాఫీ పట్టుకొస్తాను" అని వంటింట్లోకి వెళ్లాడతను.

"ఏవండీ మీరు ఓ విషయం గమనించారా?" భర్త భుజాన్ని తన భుజంతో గుద్ది గుసగుసలాడింది జగదాంబ.

"ఏంటదీ?"

"ఇతను ఎంతసేపూ అదేదో సామెత చెప్పినట్టు...అదేదో సామెత చెప్పి నట్టు అంటాడే తప్ప ఇంతవరకూ ఒక్క సామెత కూడా చెప్పినట్లు లేదండీ..."ఏదో రహస్యాన్ని కనిపెట్టినట్టు చెప్పింది జగదాంబ.

"నిజమేనేవ్..భలే కనిపెట్టావే ఈ విషయాన్నీ..." భార్య భుజాన్ని తన భుజంతో నెట్టి అన్నాడు గుర్నాథం.

"అందుకే నేనతనికి ఓ పేరు పెట్టబోతున్నా..." కళ్ళెగరేస్తూ అంది ఆమె.

"ఏంటదీ?" కుతూహలంగా అడిగాడతడు.

"మీరే చూస్తారుగా.."

అంతలో వాళ్ళను ఏదో అడగడానికి అక్కడికి వచ్చాడు సాంబశివరావ్.

"ఆఁ..ఇదిగో...సామెతల్రావ్ బాత్రూమ్ ఎటో కాస్త చూపిస్తావా?" నవ్వుతూ అడిగింది జగదాంబ.

"ఏవండీ...నా పేరు అదికాదు!" నసుగుతూ అన్నాడు.

"మీరు పదే పదే సామెత అన్న పదాన్ని అంటుంటే అలా పిలిచాను. బాలే పోతే చెప్పండి" కేర్‌లెస్‌గా అంది.

"అబ్బే...అదేంకాదండీ...బావుంది...బావుంది" అంటూ బాత్రూమ్‌కు దారి చూపించి వెళ్లిపోయాడతడు.

జగదాంబ భర్తవైపు తిరిగి కళ్ళెగరేస్తూ-

"సామెతల్రావ్ అంటే అదేదో బిరుదనుకుంటున్నాడు గురుడు. అతనికి 'ఏ సామెతలూ రావు' అన్నది అంతరార్థం. అది తెలిసేడిస్తేగానీ అతనికి..." అంటూ క్రికెట్ ప్లేయర్స్ ఒకర్నొకరు చప్పట్లు చరుచుకున్నట్లు వాళ్లిద్దరూ చేతులు చరిచి విరగబడి నవ్వుకున్నారు.

★ ★ ★

"పిన్నీ...పిన్నీ..." అంటూ ఇంట్లోకి అడుగుపెట్టింది సాంబశివరావ్ భార్య గంగాభవాని.

"ఏమిటే...ఎప్పుడు రమ్మని చెప్పి పంపాను. ఇప్పుడా రావడం" అంటూ కోప్పడింది పాపాయమ్మ.

"నేనెప్పుడో వద్దామనే బయలుదేరాను పిన్నీ...కానీ ఊళ్ళోకి ఎవరో

'చింతకాయల స్వామీజీ' అట. వచ్చారంటే వెళ్లి దర్శనం చేసుకొస్తున్నాను. ఇప్పుడు ఆయనే ఈ వీధిలోకి ఊరేగింపుగా వస్తున్నారు. చూద్దువురా పిన్నీ...'' అంటూ బామ్మను తొందరపెట్టింది గంగాభవాని.

"ఏమిటే ఇంట్లో ఎన్ని పన్లు ఉన్నాయనుకుంటున్నావ్? ఓ వైపు అమ్మాయి వాళ్ళు గదిలో కూర్చుని ఉన్నారు. ఈ సమయంలో అదేదో సామెత చెప్పినట్టు స్వామీజీని దర్శనం చేసుకోమంటావేమిటే పిచ్చిదానా?'' భార్యను దబాయించాడు సామెత్రలావ్.

"కాస్త మూస్తారా...ఎప్పుడు ఏ పనిచెయ్యాలో మాకూ తెలుసు. వెళ్లి మీ పని చూసుకోండి''

భార్యకు నోరివ్వడం ఇక మంచిది కాదనుకుని వచ్చిన అతిథులకు కాఫీ ఇచ్చే పనిలో పడ్డాడు సామెత్రలావ్.

ఇంతలో వీధిలో కలకలం మొదలయింది.

"చింతకాయల స్వామీజీకి జై...త్రికాలజ్ఞుల స్వామీజీకి జై...'' అన్న ఘోష జోరుగా వినిపించసాగింది.

అందరూ గబగబా వీధిలోకి నడిచారు ఆతృతగా.

శ్రావణి కుటుంబసభ్యులు కూడా బయటికొచ్చి అరుగుమీద నిలబడ్డారు.

ఆజానుబాహుడైన ఓ వ్యక్తి బవిరిగడ్డంతో ఒంటిమీద కాషాయవస్త్రాలతో నుదుట విబూధిరేఖలతో ప్రసన్నంగా నడిచి వస్తుండగా వెనక జనం పాలోమంటూ వెంటబడుతున్నారు.

స్వామీజీ ముందుకు నడుస్తుంటే కాళ్లకు నమస్కరించే వాళ్ళు కొందరు. సాష్టాంగపడేవాళ్ళు మరికొందరు. పాదపూజ చేసేవాళ్ళు ఇంకొందరు. అందరినీ చిరునవ్వుతో దీవించి చింతకాయనొకదాన్ని ప్రసాదంగా ఇస్తున్నాడు స్వామీజీ.

అదే మహా ప్రసాదంగా భావించి దాన్ని కళ్లకద్దుకుని భక్తితో తింటున్నారు భక్తులు.

స్వామీజీ తమ ఇంటిముందుకొచ్చేసరికి గబగబ ముందుకు వెళ్లి చేతులు జోడించి నమస్కరించింది పాపాయమ్మ.

స్వామీజీ దీవించబోయేంతలో ఆమె తన దిష్టి సరంజామాతో తయారైపోయింది.

స్వామీజీకి హారతి పడుతూ-

"అబ్బో అబ్బో...ఎందరు భక్తులు. ఎందరు అభిమానులు. అందరినీ దీవిస్తూ కరుణిస్తూ చింతకాయలు పంచుతూ.,. ఎన్నో ఊళ్ళు తిరిగి బాగా అలిసిపోయారు స్వామీ తమరు. అందుకే మీ ఆరోగ్యం బావుండాలని ఇలా దిష్టి తీస్తున్నాను. ఏమీ అనుకోకండి స్వామీ...'' అంటూ హారతి పట్టసాగింది బామ్మ.

జీవితంలో మొదటిసారి ఖంగుతిన్నాడు చింతకాయల స్వామీజీ.

"స్వామీజీకే దిష్టి తీసిందే ఈ పెద్దామె?'' భార్య భుజాన్ని గుద్ది అన్నాడు గుర్నాథం.

"మరే...ఘటికురాలే!'' భర్త భుజాన్ని తన భుజంతో గుద్దుతూ అంది జగదాంబ.

సరిగ్గా అప్పుడు జరిగిందా సంఘటన.

హారతి పడుతున్న పాపాయమ్మ హారతి వెలుగు తగ్గిపోతుంటే మరింత కర్పూరం గడ్డవేసింది తట్టలో.

ఉన్నట్టుండి మంట పెరగడంతో ముఖం భాగం నుండి కాస్త కిందికి దించింది తట్టను.

అంతే!

మంట కాస్తా గడ్డానికి అంటుకుంది.

దాన్ని ఆర్పే తొందరలో భక్తుల చేతులు స్వామీజీ గడ్డంపై పడ్డంతో అది కాస్తా ఊడిపోయింది.

అంతే! అందరూ నోరు తెరుచుకుని ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయారు.

అతడు...మరెవరో కాదు! గజదొంగ జగ్గూ అని తెలియగానే అతణ్ణి గట్టిగా పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

పాపాయమ్మ చేసిన పనికి అందరూ ఆమెను మెచ్చుకోసాగారు.

"నాదేముంది...అంతా ఆ ఏడుకొండలవాడి మహిమ'' అంటూ వంటఇంట్లోకి దారితీసింది బామ్మ, అనుసరించింది సామెత్రలావ్ భార్య గంగాభవానీ.

"అమ్మో..అమ్మో...ఎంత పనిజరిగింది. అదేదో సామెత చెప్పినట్టు స్వాముల ముసుగులో గజదొంగలుంటారన్నమాట!'' అంటూ హాల్లోకి నడిచాడు సాంబశివరావ్.

అందరూ అతణ్ణి అనుసరించారు.

సరిగ్గా అప్పుడు-


## యాదృచ్ఛికం!

అమెరికాలో మేరీ హిచ్‌కాక్ మెమోరియల్ హాస్పిటల్‌లో 43 సంవత్సరాల జోడీపార్డ్‌కి కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేయాల్సి వచ్చింది. 1991లో ఒకసారి కిడ్నీ దానం పుచ్చుకున్న ఆమె ఇంతకాలం నెట్టుకువచ్చింది. మళ్లీ ఆమెకు కిడ్నీ కావాల్సి వచ్చింది. అయితే హాస్పిటల్ నిబంధనల ప్రకారం ఆమె బంధువుల్లో ఆరోగ్యవంతులొకరు తమ కిడ్నీని దానం చేస్తేనే ఆమెకు మరో కిడ్నీ లభ్యమవుతుంది. జోడీ విషయంలో ఆమె భర్త పీటర్ కిడ్నీ దానం చేయడానికి సిద్ధమయ్యాడు. అయితే డాక్టర్లు ఓ వింత విషయాన్ని వాళ్లకు చెప్పారు. పీటర్ కిడ్నీని అదే హాస్పిటల్‌లో అదే సమయంలో మరో మహిళకి అమర్చుతున్నారని, ఆమె భర్త దానం చేసిన కిడ్నీనే జోడీకి మార్చబోతున్నారని. ఆ అజ్ఞాత దంపతులెవరో వీళ్లకి తెలియదు, వీళ్లెవరో వాళ్లకు తెలియదు హాస్పిటల్ నిబంధనల ప్రకారం. అయితే తమ భర్తల కిడ్నీలను వారి భార్యలు ఒకరిది ఇంకొకరు మార్చుకున్న సంగతి విని వాళ్ళు యాదృచ్ఛిక సంఘటనగా అబ్బురపడ్డారు.

## న్యూయార్క్‌లో హిందీ ప్రకటనలు

ఇటీవల న్యూయార్క్‌లో మేయర్ ఎలక్షన్ల ప్రచారం కోసం అభ్యర్థులు టీవీ ఛానల్స్‌లో పలురకాల భాషల్లో ప్రకటనలు చేసారుట. రష్యన్, మందారిన్, కేన్టనీస్, కొరియన్‌లతోపాటు హిందీ, ఉర్దూ భాషలు కూడా ఉన్నాయిట.

-విమలారామం



"హలో...గుడ్ ఈవెనింగ్ ఎవ్రీబడీ..." అంటూ ఎంటరైంది ఓ శాల్తీ.

తలమీద హెల్మెట్ ఉండడంతో అతని పర్సనాలిటీని అంచనా వేయడం సాధ్యంకాలేదు అక్కడున్నవాళ్లకు.

ఈ ముసుగులో ఇంకే దొంగ ఉన్నాడోనన్న కంగారులో.

"హలో ఎవరు మీరు?" అడిగింది శ్రావణి ధైర్యంగా.

అతడు హెల్మెట్ విండోను పైకి లేపి "అయాం హనుమంతు. ఓన్లీ బ్రదర్ ఆఫ్ ఏకాంబరం. అందరూ నన్ను హెల్మెట్ హనుమంతు అని ముద్దుగా పిలుస్తారు" అన్నాడు పళ్లికిలిస్తూ.

"ఏ బ్రాండ్ నీది? టీవీఎస్ ఆర్ హోండా?" అతడు ధరించిన హెల్మెట్‌ను అద్భుతంగా చూస్తూ అడిగాడు మదన్.

"హెర్క్యులెస్.." స్టయిల్‌గా అన్నాడు హనుమంతు.

"సైకిల్‌కు హెల్మెట్టా?" ఆశ్చర్యపోయాడు మదన్.

"సైకిల్‌కూ హెల్మెట్‌కూ ఎలాంటి సంబంధమూ లేదు. మా బామ్మ దిష్టి నుండి తప్పించుకోవడానికే ఈ ఏర్పాటు" అన్నాడు హనుమంతు.

"ఇక్కడ నా చిన్న మనవడి గొంతు విన్నానే. ఏడీ వాడు? రేయ్... ఎప్పుడొచ్చావ్ ఊరి నుండి. నీ చదువెలా సాగుతోంది. ఈరోజు కూడా ఏమిట్రా ఈ అవతారం? తియ్ దాన్ని.." మనవడిని చిరుకోపంతో విసుక్కుంది బామ్మ. ఆవిడకు మనవడంటే పంచప్రాణాలు.

"నో బామ్మా... నాకిదే సేఫ్టీ..." మొండికేశాడు హనుమంతు.

"పోన్లే! విదేశాల్లో ఉన్న మీ అమ్మానాన్నలు ఎటూ రాలేరు. నువ్వైనా వచ్చావ్? అంతేచాలు. ఆ హాస్టల్ తిండి నీకు ఒంటబడుతున్నట్టు లేదురా. ఎంత చక్కగా ఉండేవాడివి? ఎలా చిక్కిపోయావో చూడూ...ఉండు నీకు దిష్టి తీస్తా" అంటూ తయారయ్యింది బామ్మ.

"అయినా ఈ రోజుల్లో కూడా ఈ దిష్టి తియ్యడాలూ, మంత్రించడాలూ, తాయెత్తులు కట్టడాలూ...ఇవన్నీ ఏంటండీ ఛాదస్తం కాకపోతే?" అంది గుర్నాథం భార్య జగదాంబ.

"ఛాదస్తం అని కొట్టిపారేయకు తల్లీ! అవన్నీ ఈరోజుల్లోనూ ఉన్నాయి. కాకపోతే మరోరూపంలో ఉన్నాయంతే! పాతతరంవాళ్లం కాబట్టి దిష్టి అంటున్నాం. మీరేమో ఆ దిష్టినే సరికొత్త పేరుతో పిలుస్తున్నారు" అంది బామ్మ.

"ఈరోజుల్లోనూ ఉన్నాయా? నో...నేను నమ్మను..." అన్నాడు గుర్నాథం.

"అయితే వినండి. ఆసియా గేమ్స్, ఒలింపిక్ గేమ్స్ అంటూ నిర్వహిస్తారే. ఆ ఆటలకు మొదటిరోజు ఓ పెద్ద కాగడాను పట్టుకుని ఊరేగించి క్రీడామైదానంలో వెలిగిస్తారుగా. అదేమనుకుంటున్నారు? ఆ ఆటలకు ఏ ఆటంకాలూ రాకుండా తీసే దిష్టి... అంతేకాదు ఏ ఫంక్షన్‌లోనైనా ముందుగా జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం అంటూ ఒకటుంటుంది గమనించారా? నలుగురూ కలిసి కొవ్వొత్తితో పెద్ద దీపస్తంభాన్ని వెలిగిస్తారు. అదేమనుకుంటున్నారు? ఆ కార్యక్రమం విజయవంతంగా పూర్తికావాలని తీసే దిష్టి.

అంతెందుకు శ్రీహరికోట నుండి రాకెట్ వదులుతారుగా ఆకాశంలోకి. అప్పుడు మొదట దానికింద ఎంత పెద్దమంట వస్తుందో మీరు చూసే వుంటారు. అదేమిటనుకుంటున్నారు? ఆ రాకెట్ నిర్విఘ్నంగా కక్ష్యలోకి ప్రవేశించాలని తీసే దిష్టి.."

అంతే!

కెవ్వుమని కేకపెట్టి కిందపడిపోయి స్పృహ తప్పాడు గుర్నాథం.

"అయ్యయ్యో...ఎంత పనిచేశావ్ పెద్దమ్మా. అదేదో సామెత చెప్పినట్టు నిజాలు చెప్పి నిఖార్సయిన మనిషిని స్పృహ తప్పేలా చేశావ్ కదమ్మా" కంగారుగా అన్నాడు సాంబశివరావు.

"పెన్నీ..గ్లాసుతో కాసిన్ని మంచినీళ్ళు పట్టుకురా! ముఖంపై చల్లుదాం...." హడావిడిగా అన్నాడు ఏకాంబరం.

"మీరేం కంగారుపడకండి. నాన్‌స్టాప్ డాటాను ఎవ్వరైనా లిస్ట్‌ఔట్ చేస్తే ఆయనిలాగే స్పృహ తప్పుతుంటారు. ఆయన ముక్కు దగ్గర మిరిండా వాసన చూపిస్తే ఠక్కున లేచి కూచుంటారు" నింపాదిగా అంది జగదాంబ.

"అట్లాంటివన్నీ ఈ ఊళ్లో దొరకవండీ. సోడా...పన్నీరుసోడా...కలరూ...షరబత్....ఇలాంటివే దొరుకుతాయి.." అన్నాడు సాంబశివరావు.

"హయ్యా! అయితే నాకు 'షవర్‌బాత్' కావాలి" అన్నాడు ఆశగా మదన్.

మళ్లీ తలపట్టుకుంది శ్రావణి.

అంతలో అటు ఇటు కదిలి మెల్లగా కళ్ళు విప్పి చూశాడు గుర్నాథం.

"అయినా...అదేదో సామెత చెప్పినట్టు ఇదేం మూర్ఛరోగమండీ..." అంటూ ఇంకేదో చెప్పబోయాడు సాంబశివరావ్.

"ఛత్ నువ్ నోర్ముయ్ సాంబయ్యా.. బస్టాండ్లో ఏ పాపిష్టి కళ్లో ఆయన మీద పడుంటుంది. దాని ప్రభావమే ఈ కళ్ళు తిరగటాలూ...మూర్ఛపోవటాలూనూ! కాస్త దిష్టి తీస్తే అన్నీ సర్దుకుంటుంది" అంటూ పాపాయమ్మ హారతి


## ప్రపంచ పౌరుడు బ్రాన్సన్

బ్రిటన్‌లో ఎయిర్‌లైన్, రైల్ బిజినెస్‌ల మీద తాను సంపాదించిన దాంట్లో ఇకనుంచి లాభాలన్నీ తానేర్పరచిన ఎన్విరాన్‌మెంటల్ ట్రస్టు ద్వారా గ్లోబల్ వార్మింగ్‌ని అరికట్టడానికి వినియోగిస్తానన్నాడు ప్రముఖ వర్జిన్ గ్రూపు ఛైర్మన్ రిచర్డ్ బ్రాన్సన్. వచ్చే పదేళ్లల్లో వాతావరణాన్ని పరిశుభ్రం చేయడానికి మూడు బిలియన్ల డాలర్లు ఖర్చు పెడతాడట. అమెరికన్ ప్రెసిడెంట్ బుష్ తన ప్రభుత్వం క్లైమేటివ్ టెక్నాలజీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌కు మూడు బిలియన్ డాలర్లు కేటాయిస్తోందని ప్రకటించిన మర్నాడే ప్రపంచ పౌరునిగా అది తన ధర్మమంటూ బ్రాన్సన్ ముందుకు రావడం గమనార్హం. తనను చూసి మరెన్నో కంపెనీలు తమంతట తాము వాతావరణాన్ని పరిశుభ్ర పరచడానికి వెచ్చిస్తారని ఆశిస్తున్నట్లు ఒక టీవీ ఇంటర్వ్యూలో ఆయన చెప్పాడు.

## ఖరీదైన ఫోను

టిటానియమ్ బాడీతో 0.25 కేరట్ డైమండ్ బటన్స్‌తో ఆడంబరమైన మొబైల్ ఫోన్‌ను డిజైన్ చేసాడు జొరెన్‌గో. ఒక్కో ఫోను ఖరీదు రెండు లక్షల పౌండ్లు (కోటిన్నర రూపాయలు). దాంతో మాట్లాడుతుంటే వెండి రంగులో ఉండే ఈ ఫోను, మామూలప్పుడు నల్లగా మారుతుందిట. బ్లాక్ డైమండ్ అన్న పేరుగల ఈ ఫోన్లు అయిదు మాత్రమే తయారవుతున్నాయి. వచ్చే ఏడు లభ్యమయ్యే ఈ ఫోన్లని ముగ్గురు అమెరికన్లు, ఒక రష్యన్, ఒమాన్ సుల్తాన్‌లు ఆర్డరిచ్చారుట.

-విమలారామం



పళ్లెంతో తయారైపోయి గుర్నాథానికి దిష్టి తియ్యసాగింది.

కర్పూరం ఆరిపోయాక చూస్తే ఆయన ముఖం నల్లగా మసిపూసినట్లుగా తయారైంది.

అంతే!

అతణ్ణి చూసి కెవ్వుమని అరిచింది జగదాంబ.

సరిగ్గా అప్పుడు ఎంటరయ్యాడు ఆ ఊరి ఎస్సై! వెనకే ఇద్దరు కానిస్టేబుల్స్ కూడా వచ్చారు.

"మీరేనా పాపాయమ్మ అంటే..." అడిగాడు ఎస్సై.

"ఔను!" అంది భయం భయంగా.

"కంగ్రాట్స్ అమ్మా! ఎంతోకాలం నుంచి మా కళ్ళు కప్పి తప్పించుకు తిరుగుతున్న గజదొంగ జగ్గూను పట్టిచ్చినందుకు ప్రభుత్వం మీకు పాతికవేలు బహుమానం ప్రకటించింది. రిపబ్లిక్ డే నాడు మీకు బహుమానం అందజేస్తారు. ఈ విషయం చెప్పడానికే వచ్చాం..." అంటూ పాపాయమ్మకు నమస్కరించి నిష్క్రమించారు వాళ్ళు.

వాళ్ళు వెళ్లాక పాలోమంటూ ఇరుగుపొరుగు వాళ్లంతా వచ్చి బామ్మకు శుభాకాంక్షలు తెలిపారు.

'ఏమో అనుకున్నా...ఛాదస్తం అంటూ దిష్టిని చిన్నచూపు చూశా! కానీ పెద్దామె మా గొప్పమనిషే..'మనసులో మెచ్చుకుంది జగదాంబ.

ముందు తేరుకున్నది శ్రావణి.

"అయినా మీ ఇంటికొచ్చిన అతిథులకు ఇదేనా మీరు చేసే మర్యాదలు! ఇప్పుడే ముఖాలకు మసిపూస్తున్నారంటే ఇక పెళ్లయ్యాక ఏం పూస్తారో? ఏమో! డాడీ ఈ పెళ్లిచూపుల్ని క్యాన్సిల్ చేయండి.." అంటూ కర్చీఫ్‌తో తండ్రి ముఖానికి పట్టిన మసిని తుడవసాగింది.

"ఈ పెళ్లిచూపులు క్యాన్సిల్.." డిక్లేర్ చేశాడు గుర్నాథం.

ఇంతలో సాంబశివరావ్ భార్య గంగాభవానీ వేడివేడి పకోడీలు, స్వీట్లు పళ్ళెంలో పట్టుకొచ్చింది.

ఆ ఐటెమ్స్ చూసి వెనక్కు తగ్గాడు గుర్నాథం. అందరికీ తలా ఒక ప్లేట్ అందించాడు హెల్మెట్ హనుమంతు.

అందరూ మాటలాపి తినడంలో పడ్డారు.

"మీరు కాస్త ఆ హెల్మెట్‌ను ఓసారి తీస్తారా? మిమ్మల్ని ఓసారి చూడాలి" రిక్వెస్ట్ చేసింది శ్రావణి.

"ఓ ఐదునిముషాలు మాత్రమే తీస్తాను. ఆపైన వీలుకాదు" బామ్మనే చూస్తూ అన్నాడు హనుమంతు.

"ఓకే!" అంది శ్రావణి.

హెల్మెట్ తీశాడు హనుమంతు. ఉంగరాల జుట్టు, కోటేరులాంటి ముక్కు, కోలమొహం..."వావ్! వాట్ స్మార్ట్‌గై!" అందరికీ వినబడేలా మెచ్చుకుంది శ్రావణి.

అతణ్ణే ఓ ఐదునిముషాలు పరిశీలనగా చూసి వెంటనే తల్లి చెవిలో ఏదో గుసగుసలాడింది.

జగదాంబ భర్త చెవిలో ఏదో గుసగుసలాడింది.

"అదేదో సామెత చెప్పినట్టు మీలో మీరే గుసగుసలాడుకుంటే ఎలా? విషయం ఏమిటో చెబితే మేమూ సంతోషిస్తాంగా?" అన్నాడు సాంబశివరావ్.

ఆ విషయం ఎలా చెప్పాలబ్బా అంటూ టీనేళ్ళు నమిలాడు గుర్నాథం. భర్త భుజాన్ని తన భుజంతో గుద్ది విషయం చెప్పమని ప్రోత్సహించింది జగదాంబ.

"మరేంలేదండీ మా అమ్మాయికి అన్నకన్నా తమ్ముడే నచ్చాడట. మీకు అభ్యంతరం లేకపోతే మీ చిన్న మనవణ్ణి మా అమ్మాయికి ముడిపెట్టేద్దాం. ఏవంటారు?"

గతుక్కుమన్నాడు ఏకాంబరం.

"మా చిన్నాడికి ఇప్పట్లో పెళ్లి చేసే ఆలోచన లేదయ్యా. వాడి చదువింకా పూర్తికావాలి!" చెప్పింది బామ్మ.

"అప్పటిదాకా ఆగుతామండీ..." ఠక్కున చెప్పింది జగదాంబ.

"బావుందమ్మా సంబడం... అదేదో సామెత చెప్పినట్టు ఏమిటీ నిర్ణయాలు. కలికాలం కాకపోతే..." కోపంగా అన్నాడు సాంబశివరావు.

'కాస్త మూస్తారా' అంటూ సైగ చేసింది అతడి భార్య.

"చిన్నాడి కథ అలా ఉంచండి. పెద్దాడు మీకు నచ్చాడా, లేదా? ముందా విషయం చెప్పండి" నిలదీసింది పాపాయమ్మ.

మళ్లీ భార్యాభర్తలిద్దరూ గుసగుసలాడుకున్నారు.


"ఇప్పుడేం చెప్పలేమండీ... వెళ్లి ఉత్తరం రాస్తాం" అంది శ్రావణి.

అంతే..ఏకాంబరంలో ఆందోళన మొదలైంది. ఈ సంబంధమూ కుదరకపోతే ఇక తను ఎప్పటికీ బ్రహ్మచారిగానే మిగిలిపోవలసిందే. బామ్మ అంటూనే ఉంది 'ముదిరిన బెండకాయలా తయారవుతున్నావ్. ఇలాగే ఏళ్ళు గడిచిపో



## మంచి బ్రేక్ కావాలి!

చోటు అని అందరిచేత ముద్దుగా పిలుచుకునే నేహాధుపియా కోచిన్‌లో 27 ఆగస్టు, 1980లో పుట్టింది. ఫెమీనా మిస్ ఇండియా-2002గా ఎన్నికైంది. కమాండర్ ప్రదీప్‌సింగ్ ధుపియా కూతురైన నేహా ఆర్మీ పబ్లిక్ స్కూల్ వైజాగ్‌లో చదివింది. 19ఏళ్ల వయసులో టీవీ సీరియల్ 'రాజధాని'తో కెరీర్‌ని ప్రారంభించి వివిధ కంపెనీలకు బ్రాండ్ అంబాసిడర్‌గా మారింది. పలు బాలీవుడ్ చిత్రాల్లో నటించిన నేహా ఇంకా తనకి మంచి బ్రేక్ రాలేదంటోంది.



తుంటే ఇంకెవరు పిల్లనిస్తార్రా నీకు' అని. కనీసం ఈ సంబంధమైనా కుదురుతుందేమోనని గంపెడాశతో తనుంటే వీళ్లిలా అంటున్నారేంటీ.

"అదేదో సామెత చెప్పినట్టు తరువాత ఏం చెబుతారులేమ్మా! టెంకాయ పగలగొట్టినట్టు పెద్దాడు నచ్చాడా? లేదా? అన్న విషయం ఇప్పుడే చెప్పేసేయండి" అన్నాడు సాంబశివరావ్.

"చూడు సామెతల్రావ్. అప్పటికప్పుడు చెప్పేసే సామెత కాదిది. మా బంధువుల్ని కలిసి చర్చించాలి. వాళ్లకు ఈ అబ్బాయి ఫోటో నచ్చాలి. పేరు, ఫలాలు చూడాలి. ఇలా ఎన్ని తతంగాలున్నాయనుకున్నావ్?" అంది జగదాంబ.

ఆ మాటలతో మరింత కృంగిపోయాడు ఏకాంబరం.

"నేనప్పుడే అనుకున్నా భయ్యాకు ఈ సంబంధమూ కుదరదేమోనని?" అంటూ తలపై హెల్మెట్ ఫిక్స్ చేసేసుకున్నాడు హనుమంతు.

"ఛత్, నువ్ నోర్ముయ్!వాడి మాటలకేం గానీ... ఏముందమ్మా ఏ విషయమూ ఇప్పుడే చెప్పేస్తే బావుంటుంది కదా!" అంది బామ్మ.

"లేదమ్మా...మేం ఊరెళ్ళి ఏవిషయమూ ఉత్తరంలో రాస్తాం..." అంటూ వారి నుండి సెలవు తీసుకుని బయలుదేరారు గుర్నాథం కుటుంబసభ్యులు.

అందరూ మౌనంగా దిగాలుపడి కూర్చుండిపోయాడు.

* * *

మర్నాడు ఉదయం ఆరుగంటలు...

సెల్‌ఫోన్ రింగైంది.

చిరాగ్గా తీశాడు ఏకాంబరం.

"హలో..ఏకాంబరం గారేనా?"

అటునుండి శ్రావణి మాట్లాడుతోంది.

"అవును...చెప్పండి" నిష్ఠూరంగా అన్నాడు.

"ఏం నిర్ణయించుకున్నారు? మీ తమ్ముణ్ణి ఇవ్వడానికి మీరు రెడీయేనా?" అంది శ్రావణి.

"ఏంటండి మీరు? మీకిదేమైనా న్యాయంగా ఉందా? చూడ్డానికి వచ్చింది నన్ను. నాకన్నా బావున్నాడని మా తమ్ముణ్ణో, స్నేహితుణ్ణో, బంధువునో చేసుకుంటాననడం ధర్మంగా ఉందా? వినడానికే అసహ్యంగా ఉంది..."ఆవేశంగా అన్నాడు ఏకాబరం.

"కదూ..మరి మీ మగాళ్ళు చేస్తున్న పని అదేగా? మీదాకా వస్తే అసహ్యంగా ఉందా?!" ప్రశ్నించింది శ్రావణి.

'నిజమే...మగాళ్ళు ఇలాంటి పనులు చేయడం ఎంత అనాగరికం?'

ఆలోచనలో పడ్డాడు ఏకాంబరం.

వెంటనే తేరుకొని గట్టిగా అరిచాడు.

"అయినా వాణ్ణి ఇవ్వడానికి కుదరదండీ...ముందు నా విషయం తేల్చండి.." నిక్కచ్చిగా అన్నాడు ఏకాంబరం.

"ఉత్తరం రాస్తామన్నాంగా?" నింపాదిగా అంది.

"మీరు ఉత్తరం రాయడానికి ఎన్నాళ్ళు పడుతుందో ఏమో? అప్పటివరకూ టెన్షన్‌తో ఎదురుచూడ్డం నరకమండీ? తొందరగా ఏ విషయం అట్టే నాన్చకుండా చెప్పేయండి" ఆవేదనగా అన్నాడు.

"ఔనా? మరి ఎందరు పెళ్లికాని కన్యలు రాని ఉత్తరం కోసం కళ్ళుకాయలు కాసేలా ఎదురుతెన్నులు చూస్తూ నరకం అనుభవిస్తున్నారో మీకు తెలుసా?"

'అమ్మో...ఒక్కరోజుకే తను తట్టుకోలేకపోయాడు. పాపం రోజుల తరబడి ఆ యాతన. ఆ వేదన అనుభవించడం ఎంత భయంకరం?'

మళ్ళీ మౌనం వహించాడు ఏకాంబరం.

"మరి...అందుకు శాస్తిగా నాకీ శిక్ష వేస్తున్నారా?" అమాయకంగా అడిగాడు ఏకాంబరం.

వస్తున్న నవ్వును ఆపుకుంటూ అంది శ్రావణి.

"మొద్దబ్బాయ్...నువ్వెప్పుడో నాకు నచ్చావ్! పెళ్లిచూపులయిన అమ్మాయిల మానసికస్థితి ఎలా ఉంటుందో నీకు. అంటే మీ మగాళ్లకు తెలియజెప్పాలనే మా కుటుంబసభ్యులంతా ఇలా నాటకం ఆడాము తెల్సిందా?" అంది ముద్దుముద్దుగా.

"నిజంగా?" తేలికపడ్డ మనసుతో అడిగాడు.

"నిజంగా!..వచ్చే ఆదివారం బావుంది. మీరంతా మా ఇంటికి రండి. చూపులకు కాదు సుమా, పెళ్లి ఖాయం చేసుకోవటానికి..." అంటూ తియ్యగా నవ్వి ఫోన్ పెట్టేసింది శ్రావణి.

"బామ్మా...." అంటూ ఆనందం పట్టలేక కేకపెట్టి స్పృహ తప్పాడు ఏకాంబరం.

★



## బిజీగా ఐస్

ఐసూ, ఐస్, ఆష్ అంటూ ముద్దుముద్దుగా పిలిపించుకునే అందాల భామ ఐశ్వర్యారాయ్ తాజాచిత్రం 'ఉమ్రావ్‌జాన్'తో కొత్త ఇమేజ్‌ని సొంతం చేసుకుంటోంది. నవంబర్ ఒకటిన పుట్టినరోజు జరుపుకున్న ఈమె మిస్‌వరల్డ్ ఎన్నికైన తర్వాత పలు చిత్రాల్లో నటించింది. అందాలకిరీటం కొత్త గ్లామర్‌ని సొంతం చేసుకున్నా ఆ తర్వాత బాలీవుడ్ కెరీర్‌ని కొత్తగా మలుచుకుంది. 'హం దిల్ దే చుకే సనమ్' చిత్రానికి గాను ఈమెకి ఫిల్మ్ ఫేర్ అవార్డు లభించింది.

